

నిండుగా నీళ్లు..

పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల నందివాగు ప్రాజెక్టు మరమ్మతులకు నోచుకోవడం లేదు. 8లో▸



వ్యాపారవేత్తలుగా ఎదగాలి

వీధి వ్యాపారులు స్వయం శక్తితో వ్యాపార వేత్తలుగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. 8లో▸



పేదల కల నెరవేర్చడమే..

పేదల సొంతింటి కల నేరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

వికసించిన బ్రహ్మకమలాలు



కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాదేవుని ఆలయ ఆవరణలో శుక్రవారం రాత్రి బ్రహ్మ కమలాలు వికసించాయి. వాటికి ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్క తొమ్మిది అడుగుల ఎత్తు పెరిగి రెండు పూలు పూసిందని స్థానికులు తెలిపారు.

వీధి వ్యాపారులకు బీజేపీ అండ

ఫుడ్ మేళాను సందర్శించిన పార్టీ నాయకులు



ఫుడ్ మేళాలో బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: వీధి వ్యాపారులకు బీజేపీ అండగా ఉంటుందని మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత అన్నారు. శనివారం పాత మున్సిపల్ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ మేళాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కరోనా సమయంలో వీధిన పడిన వీధి వ్యాపారులకు చేయూతనిస్తూ, ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు రుణా లు ఇచ్చి ఆదుకున్నది కేంద్రంలోని బీజేపీ ప్ర భుత్వమేనన్నారు. తాండూరు పట్టణంలో 4,623 మంది చిరు వ్యాపారులకు స్ట్రీట్ వెండర్ పథకం ద్వారా ఆదుకుందన్నారు. భవిష్యత్‌లో వీరంతా పెద్ద వ్యాపారులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, తాండూరు పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, మాజీ కౌన్సిలర్ లలిత, సతీష్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 2025 – 26 సంవత్సరానికి గాను సివిల్స్, ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ఉచిత శిక్షణ కోసం జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 7వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదన్నారు. జూలై 13న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి కలవారుదరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు

పరిగి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం పరిగి పట్టణంలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల విద్యను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. వారిని బాగా చదివిస్తే ఉన్నత స్థానంలో నిలుస్తారని పేర్కొన్నారు. చిన్నతనంలో పెళ్లి చేస్తే వారి ఆశయాలకు అడ్డుకట్ట వేసిన వారమవుతామని అన్నారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్టాలపై అవగాహన ఉన్న వారు నేరాలు చేయరన్నారు. ప్రతి గ్రామంలో.. ప్రతి ఇంట్లో మద్యపాన నిషేధం అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగులశిల్ప, అంకిత స్వచ్ఛంద సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ డానియల్, జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అడ్వొకెట్లు వెంకటేష్, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

11,801 దరఖాస్తులు

భూ సమస్యల పరిష్కారం కోసం భారీగా అర్జీలు

- జిల్లాలో ముగిసిన భూ భారతి సదస్సులు
- పీఓబీ, డేటా సవరణ సమస్యలే అధికం
- ఇందులో ఎక్కువగా కలెక్టర్ పరిధిలోకి వచ్చేవే..
- కోర్టు కేసుల్లో ఉన్నవి అనేకం



ఇటీవల పరిగి మండలంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సు

వికారాబాద్: జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ముగిశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కొత్త రెవెన్యూ చట్టం భూ భారతి ఈ నెల 2 నుంచి అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. 3వ తేదీ నుంచి గ్రామాల్లో సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 19 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్విరామంగా సాగింది. ఈ నెల 20తో సదస్సులు ముగిశాయి. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం అధికారులు కొంత కాలంగా శ్రమిస్తున్నా అనేక సమస్యలు మిగిలిపోయాయి. తాజాగా నిర్వహించిన భూ భారతి సదస్సులకు రైతుల నుంచి వచ్చిన అర్జీలను చూస్తే ఈ విషయం ఇట్టే అర్థమవుతుంది. కోర్టు పరిధిలో ఉన్న వివాదాలు, వ్యాజ్యాలు మినహా భూ భారతి సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఆగస్టు 14వ తేదీ నాటికి పరిష్కరిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇది కొంత కష్టసాధ్యమేనని క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే అధికారులు అంటున్నారు.

పెండింగ్‌లో అనేక సమస్యలు

కొంత కాలంగా అధికారులు భూ సమస్యల పరిష్కారం కోసం కుస్తీ పడుతున్నారు. ఇలాంటి తరుణంలో మళ్లీ దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. తన లాగిన్‌లో ఐదువేలు ఉన్న అర్జీలను 500 లోపు తెచ్చామని ఇటీవల కలెక్టర్ ప్రకటించిన విషయం తెలిసింది. రెవెన్యూ సదస్సులతో మళ్లీ వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ప్రధానంగా మిస్సింగ్ సర్వే నంబర్, సాదాబైనామా, అసైన్డ్ భూముల సమస్యలు, పీఓబీ, విరాసత్, మ్యుటేషన్, డేటా కరక్షన్ తదితర సమస్యలకు సంబంధించినవి అధికంగా వచ్చాయి. ధరణి చట్టం ప్రకారం మెజార్టీ భూ సమస్యల పరిష్కారం కలెక్టర్ లాగిన్‌లోనే ఉండగా తాజా చట్టంతో చాలా వరకు అధికార వికేంద్రీకరణ జరిగిందని రెవెన్యూ అధికారులు అంటున్నారు. సగానికి పైగా సమస్యలు అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓలు పరిష్కరించేలా చట్టాన్ని రూపొందించారు. దీంతో భూ సమస్యల పరిష్కారం వేగవంతమయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు	
మండలం పేరు	దరఖాస్తులు
వికారాబాద్	1,531
కుల్కచర్ల	1,424.
పూడూరు	1,259
దోమ	1,104
మోమిన్‌పేట	1,018
యాలాల	137
బషీరాబాద్	155
పెద్దేముల్	205

భారీగా దరఖాస్తులు

జిల్లా వ్యాప్తంగా గడిచిన 19 రోజుల్లో 475 గ్రామాల్లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి 11,801 దరఖాస్తులు వచ్చాయి. 5,294 అర్జీలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు. 1,141 మంది రైతులకు నోటీసులు కూడా అందజేశారు. ఇందులో 342 అర్జీలను అనుమతించగా ఆయా కారణాలతో 31 దరఖాస్తులను తిరస్కరించారు. మిగతా వాటిని మ్యాన్యువల్ వర్క్ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సదస్సులు విజయవంతం



అందరి సహకారంతో రెవెన్యూ సదస్సులను విజయవంతంగా పూర్తి చేశాం. భూ సమస్యల పరిష్కారం కోసం పదివేలకు పైగా అర్జీలు వచ్చాయి. ప్రస్తుతం డేటా ఎంట్రీ ప్రక్రియ సాగుతోంది. కోర్టు పరిధిలో ఉన్న సమస్యలను కోర్టు ఆదేశాల మేరకు పరిష్కరిస్తాం. గతంలో రైతులు పెట్టుకున్న సాదాబైనామా సమస్యలకు సంబంధించి కోర్టులో స్టే ఉన్నందున ఆ స్టే వెకెంట్ అయ్యాక ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ప్రకారం అవి పరిష్కరిస్తాం. ఇవి మినహా మిగతా సమస్యలన్నీ ఆగస్టు 14వ తేదీలోగా పరిష్కరిస్తాం.

– ప్రతీక్‌జైన్, కలెక్టర్

యోగా ఒక జీవన విధానం

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: యోగా అనేది శారీరక వ్యాయామమే కాదు, ఒక జీవన విధానం అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో యోగా డే కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, విద్యార్థులు యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా వల్ల కలిగే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఆచరించాలన్నారు. యోగాను నిత్యం సాధన చేయడం ద్వారా మనిషిలో ఒత్తిడి, ఆందోళన తగ్గి మానసికంగా ప్రశాంతంగా ఉండవచ్చని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో యోగాపై ప్రజల్లో ఆసక్తి పెరిగిందన్నారు. దేశంలో 2,500 సంవత్సరాల క్రితం పతంజలి మహర్షి ద్వారా యోగా వెలుగులోకి వచ్చిందని గుర్తు చేశారు. ఐక్యరాజ్యసమితి యోగా ప్రాముఖ్యతను గుర్తించి జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందని పేర్కొన్నారు. యోగా అన్ని వయస్సుల వారు చేయవచ్చని, గురువుల మార్గదర్శకంలో చేస్తే ఎక్కువ ఫలితాలు ఉంటాయన్నారు. యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవిస్తారని తెలిపారు. అనంతరం ప్రజలకు యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా క్రీడల శాఖ అధికారి అబ్దుల్ సత్తార్, ఎల్‌డీఎం యాదగిరి, అయుష్ సునీత పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బంట్వారం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరాదన్నారు. రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, ఏఎంసీ చైర్మన్ మహేందర్ రెడ్డి, డైరెక్టర్లు యాదగిరి, నర్సింలు, నాయకులు మొగులయ్య, రాములు యాదవ్, రఘుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాములు, హరీశ్వర్ రెడ్డి, ప్రభాకర్, నర్సింలు, స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రాములు పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో..

స్పీకర్ ప్రసాద్‌కుమార్ తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి కోట్‌పల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు.

డబుల్ ఇళ్లు పూర్తి చేస్తాం

ధారూరు: అనంతగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయించినట్లు స్పీకర్ ప్రసాద్ కుమార్ తెలిపారు. శనివారం ధారూరులో 356 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనంతగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే 3వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.90 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ధారూరులో అసంపూర్తిగా ఉన్న 120 డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ధారూరు మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు భాస్కర్‌రెడ్డి, ఎల్.అశోక్ ముదిరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ నర్సింహులు, తహసీల్దార్ సాజిదాబేగం పాల్గొన్నారు.



ఆసనాలు వేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు

- రూ.300 కోట్లతో వివిధ పనులకు భూమిపూజ
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో భారీగా నిధులు: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి
- పాల్గొన్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

కొడంగల్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ పరిధిలో రూ.300 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. ఈ ప్రాంతానికి గత పాలకులు నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ ప్రాంతానికి అధిక మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో నియోజకవర్గ రూపు రేఖలు మారిపోతున్నాయని అన్నారు. అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు సీఎం కృషి చేస్తున్నారని కొనియాడారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలో తాగునీటి సరఫరాకు రూ.2.50 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.66.72 కోట్లు, వర్షపు నీటి పారుదల వ్యవస్థకు రూ.57.67 కోట్లు, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థకు రూ.7.09 కోట్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.78 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.66.50 కోట్లు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు రూ.6.67 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం కొడంగల్ ప్రజలు అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. గడి గుడి నేతలు ఏకమై రేవంత్‌ను గెలిపించారని కొనియాడారు. కొడంగల్‌లో చేపట్టిన పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మెడికల్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, పారా మెడికల్ కళాశాల, స్కిల్ యూనివర్సిటీ, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, కొత్త మండలాల్లో జూనియర్ కళాశాలలను మంజూరు చేసినట్లు గుర్తు చేశారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తిరుపతిరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే రూ.10వేల కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభిన్నట్లు చెప్పారు. కొడంగల్ ప్రభుత్వాస్పత్రిని విస్తరించి 220 బెడ్ల సామర్థ్యం కలిగిన టీచింగ్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్, బీసీ సంక్షేమ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలకు అధునాతన వసతులతో కొత్త భవనాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రోడ్లు భవనాలు, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖలకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.కొడంగల్– నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.4వేల కోట్లు, కొడంగల్‌లో రూ.6 కోట్లతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, రోడ్ల విస్తరణకు రూ.344 కోట్లు, పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, యువజన కాంగ్రెస్ సమన్వయ కర్త కృష్ణంరాజు, మైనార్టీ నాయకులు నయీమ్, ఆసిఫ్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య ప్రదర్శనకే డ్యూటీ మీట్

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: డిస్ట్రిక్ట్ డ్యూటీ మీట్ అనేది పోలీస్ శాఖలో సిబ్బందికి కేవలం ఒక పరీక్ష కాదని, ఇది వారి నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడానికి.. కొత్త టెక్నాలజీ నేర్చుకోవడానికి ఉపయోగపడుతుందని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ డ్యూటీ మీట్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులు, సిబ్బందికి మార్గదర్శనం చేశారు. అనంతరం పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పరిశోధనకు శాస్త్రీయ సహాయాలు, విధ్వంస నిరోధక తనిఖీ, డాగ్ స్క్వాడ్ పోటీ, కంప్యూటర్‌పై అవగాహన, ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీ పోటీలను పర్యవేక్షించారు. ప్రతిభ కనబరిచిన వారిని సంగారెడ్డిలో జరిగే జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం



వంట తయారీని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్, ఇతర అధికారులు

అనంతగిరి: వంద రోజుల ప్రణాళికలో భాగంగా వికారాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణ ప్రధాన రోడ్డులో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. వీధి వ్యాపారులతో తినుబండరాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. అడిషనల్ కలెక్టర్ సుధీర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వంటకాల రుచులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, డీఈ రాకేష్ రెడ్డి, మెప్మా పీడీ రవికుమార్, టీఎంసీ వెంకటేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

24న వాహనాల వేలం

అనంతగిరి: వికారాబాద్ ఎక్సైజ్ పీఎస్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు(ఉన్నవి ఉన్నట్లుగా) మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వికారాబాద్ ఎక్సైజ్ అధికారి రాఘువీణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా ఏస్, టాటా ఇండికా, ఐచర్ వ్యాన్‌కు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని ఆమె కోరారు. వికారాబాద్‌లోని ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో ఉదయం 11గంటలకు వేలం ఉంటుందని తెలిపారు.

మంత్రివర్గంలో అవకాశం కల్పించండి

ఖర్గేను కలిసి విన్నవించిన ఎమ్మెల్యే టీఆర్‌ఆర్



ఖర్గేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేసిన తనకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. శనివారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసి ఈ మేరకు వినతి చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మూడు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2014లో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచి పార్టీ మారకుండా పని చేశానని పేర్కొన్నారు. రెండు పర్యాయాలుగా డీసీసీ అధ్యక్షుడిగా సేవలందిస్తూ జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల గెలుపునకు కృషి చేశానని చెప్పారు. 2017లో శక్తి కన్వీనర్‌గా రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు పని చేశానని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే పని చేయని విధంగా తాను పరిగి నియోజకవర్గ ప్రజలకు అందుబాటు లో ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రానికి వెన్నెముక లాంటి ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించి అందులో తనకు స్థానం కల్పించాలని కోరినట్లు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం


అప్పాయిపల్లిలోని నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఉషశ్రీ

కొడంగల్ రూరల్: వన మహోత్సవం కోసం గ్రామాల్లో ఏర్పాటుచేసిన నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని ఎంపీడీఓ ఉషశ్రీ అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని అప్పాయిపల్లిలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మొక్కల పెంపకంతోనె వాతావరణం సమతుల్యంగా ఉంటుందన్నారు. వృక్షాలతో అటవీ సంపద పెంచడంతో వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


మురళి(ఫైల్)

కుల్కచర్ల: హైదరాబాద్‌కు వెళ్లి పని చేసుకుంటానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఇప్పాయిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఏముకంటి మురళి(29) హైదరాబాద్‌లో మొబైల్ షాప్‌లో పనిచేసేందుకు వెళ్తున్నానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లాడు. నాటి నుంచి అతని ఫోన్ పనిచేయకపోవడంతో ఆందోళనతో తల్లిదండ్రులు వారి బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మురళి సోదరుడు నరేశ్ శనివారం కుల్కచర్ల ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు టిప్పర్లు, జేసీబీ సీజ్



పరిగి: నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీని ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకుని పరిగి స్టేషన్‌కు తరలించారు. మండల పరిధిలోని సయ్యద్‌పల్లి శివారు హిరాపూర్ తండాకు వెళ్లే మార్గంలో అక్రమంగా మట్టి తవ్వుతున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం అర్ధరాత్రి ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. మూడు టిప్పర్లు, ఓ జేసీబీని పట్టుకుని పరిగి ఠాణాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం


కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ తెలుగువాడలో కొన్నేళ్లుగా లోవోల్టేజీ సమస్య కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించగా అధికారులు స్పందించి లైన్‌మెన్ వెంకట్‌రాములు పర్యవేక్షణలో శనివారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డెకరేషన్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం


గోడౌన్‌లో ఎగిసిపడుతున్న మంటలు

పహాడీషరీఫ్: డెకరేషన్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం సంభవించిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. వాదే ముస్తఫా బస్తీలో వివాహాదిశుభకార్యాలకు వినియోగించే డెకరేషన్ సామగ్రి గోడౌన్ ఉంది. శనివారం సాయంత్రం పక్కనే ఉన్న చెత్తకుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో గోడౌన్‌కు మంటలు వ్యాపించాయి. డెకరేషన్ సామగ్రిలో ప్లాస్టిక్, ఫైబర్ ఉండడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. జనావాసాల నడుమ ఉన్న ఈ గోడౌన్ నుంచి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నిండుగా నీళ్లు.. భూములు బీళ్లు

నందివాగుపై నిర్లక్ష్యపు నీడ
- ఇబ్బంది పడుతున్న ఆయకట్టు రైతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


నందివాగు ప్రాజెక్టు


తుంగతో నిండిన ఎడమ కాల్వ

మోమిన్‌పేట: నందివాగు ప్రాజెక్టును పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో తూములు తుప్పుపట్టి, కాల్వలు పూడుకుపోయి, గండ్లుపడ్డాయి. 2,650 ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ ప్రాజెక్టు వైపు పాలకులు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా రైతు భూములన్నీ బీడుగా మారాయి. ఈ ప్రాజెక్టు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విదల్చక కాస్లాబాద్, బూర్గుపల్లి, మేకవనంపల్లి, రాళ్లగూడుపల్లి, మెదక్ జిల్లా, కొడాపూర్ మండల పరిధిలోని అనంతసాగర్, జాజిపురం, దాని అనుబంధ తండాల భూములు సాగుకు నోచుకోవడం లేదు. ఈ ఆయకట్టుకింద గతంలో రెండు పంటలు పండిచిన రైతులు.. 15 ఏళ్లుగా సాగునీరందక ఇబ్బంది పడుతున్నారు.

కమిటీలు లేవు.. నిధులు రావు

ప్రతీ సంవత్సరం బడ్జెట్‌లో నిధుల కేటాయిస్తారేమోనని ఎదురు చూడడం తప్పితే ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు పూడికతీత, గండ్ల పూడ్చివేత, తూములు, పక్కగోడలు పూర్తిస్థాయిలో నిర్మించాలంటే రూ.10 కోట్లు అవసరమవుతాయని రైతులు పేర్కొంటున్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తేనే పంటలసాగుకు అవకాశం ఉంటుందని.. ప్రభుత్వం స్పందించి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రూ.5 కోట్లతో 'మిషన్ కాకతీయ'

మిషన్ కాకతీయలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.5 కోట్లతో పనులు చేపట్టినా పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరించ లేకపోయింది. నిండుగా పూడుకుపోయిన శిఖంలో మట్టితీత పనులే ఎక్కువ చేయడం వలన కాల్వల మరమ్మతులు మిగిలిపోయాయి. పాలక వర్గాలు లేక ప్రాజెక్టు అతీగతి లేకుండా పోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లుగా కురిసిన వర్షాలకు ప్రాజెక్టు నిండుగా నీరున్నా సాగుకు అందక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఎడమ, కుడి కాల్వలో పెరిగిన తుంగను సగం మేర తొలగించుకున్నా సరిగా నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కట్టపై చెట్ల పొదలు ఏపుగా పెరిగాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

● వరుణుడి కరుణ లేక..


కూబ్యానాయక్ తండాలో కలుపు తీస్తున్న ధాక్యానాయక్ కుటుంబం

ముందస్తు వర్షాలకు మురిసిన రైతన్న ముందుగానే పంట విత్తుకున్నాడు. కంది, పెసర పంటలో కలుపు పెరగడంతో కలవరపడ్డాడు. ఎంతగా ఎదురుచూసినా వరుణుడు కరుణించక పోవడంతో తమ కొడుకు బకెట్లో నీరు తెచ్చి, పంట తడుపుతుండగా తల్లిదండ్రులు కలుపుతీస్తున్నారు. ఈ దృశ్యం శనివారం 'సాక్షి'కెమెరాకు చిక్కింది.
– బొంరాస్‌పేట

విద్యార్థి అదృశ్యం


జశ్వంత్(ఫైల్)

చేవెళ్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన శనివారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన ప్రకారం.. పట్టణ కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన మెకానిక్‌గా రాము కుమారుడు జశ్వంత్(18) ఆదర్శ కళాశాలలో ఇంటర్ పూర్తిచేశాడు. ఇంట్లో నుంచి వెళ్లిన జశ్వంత్ సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేశారు. స్విచ్ఛాఫ్ రావడంతో స్నేహితులు,బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: న్యాయ పరిపాలనలో శిక్షణకు రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల నుంచి షెడ్యూల్డ్ కులాలకు చెందిన లా గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 సంవత్సరానికి గాను సెంట్రల్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌చే గుర్తించిన ఇన్‌స్టిట్యూషన్స్, సెంట్రల్ యాక్ట్, ప్రొవిజనల్ యాక్ట్ లేదా ఇన్‌కార్పొరేషన్ చేసిన లేదా స్థాపించబడిన దేశంలోని ఏదేని యూనివర్సిటీ నుంచి ఏదేని ఫ్యాకల్టీలో బేసిక్ డిగ్రీ, లా డిగ్రీ పొందిన వారు అర్హులని తెలిపారు. వార్షికాదాయం రూ.2 లక్షలు మించొద్దని, అభ్యర్థి గత సంవత్సరంలో ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని ఉండకూడదని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు న్యాయ పరిపాలనలో మూడేళ్ల వ్యవధికి శిక్షణ పొందాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.3వేలు స్టయిఫండ్, మొదటి సంవత్సరంలా పుస్తకాలు, ఫర్నిచర్ కొనుగోలు నిమిత్తం రూ.50 వేలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు జిల్లా కోర్టులు, మొబైల్ కోర్టులు, సెషన్స్ కోర్టు, డివిజన్ స్థాయి, తాలుకా స్థాయి కోర్టుల్లో గవర్నమెంట్ ప్లీడర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వద్ద శిక్షణ పొందాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 30న ఒరిజినల్ సర్టిఫికెట్లతో రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

ఘనంగా ప్లేస్‌మెంట్ అచీవర్స్ డే


ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులతో యాజమాన్యం, సిబ్బంది

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం శేరిగూడలోని శ్రీదత్త విద్యా సంస్థల్లో శనివారం ప్లేస్‌మెంట్ అచీవర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2024– 25 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత పొంది, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. విద్యా సంస్థల చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు అత్యాధునిక టెక్నాలజీలో శిక్షణ ఇస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులకు వందశాతం ప్లేస్‌మెంట్ కల్పిస్తున్నామని తెలిపారు. 46 మల్టీ నేషనల్ కంపెనీల్లో శిక్షణ ఇప్పిస్తూ పాటు వందశాతం ఉపాధి కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అకాడమిక్స్ డీన్ వెంకట అచ్యుతరావు, ప్రిన్సిపాల్ సెంథిల్‌కుమార్, డాక్టర్ మధుసూధన్‌రెడ్డి, టీపీఓ డాక్టర్ మయూరి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

స్కూల్ బస్ ఢీకొని బాలుడి మృతి

జగద్గిరిగుట్ట: స్కూల్ బస్ ఢీకొనడంతో బాలుడు మృతి చెందిన ఘటన జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. షిరిడిహిల్స్‌కు చెందిన ఏసీ టెక్నీషియన్ ముఖేష్ చౌహాన్‌కు జైసిత్ చౌహాన్ (10), కూ తురు ఉన్నారు. శుక్రవారం షిరిడిహిల్స్ సమీపంలోని తులసి నగర్ చౌరస్తా వద్ద జైసిద్ చౌహాన్ మరో బాలుడు సైకిల్ తొక్కుతూ వెళ్తున్న సమయంలో సైకిల్ అదుపుతప్పి జైసిత్ కిందపడ్డాడు. అదే సమయంలో ఆ వైపు వస్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు జైసిత్ చౌహాన్ పైనుంచి వెళ్లడంతో ఆపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, బస్సును సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పంచాయతీలకు కొత్త భవనాలు

- నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి గ్రామాలకు ఈజీఎస్ నుంచి రూ.20 లక్షల చొప్పున నిధులు
- మరో ఏడు గ్రామాలకు ప్రతిపాదనలు

యాచారం: ఈజీఎస్ పథకం నుంచి రూ.20 లక్షల చొప్పున నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఏళ్ల క్రితం నిర్మించిన శిథిల భవనాల్లోనే ఇబ్బందుల నడుమ ప్రజాప్రతినిధులు, అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. వర్షాలకు నీరంతా గదుల్లోకి చేరి విలువైన రికార్డులు తడిసిపోయేవి. తాజాగా పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరవడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంతన్‌గౌరెల్లిలో భవన నిర్మాణ పనులు జోరందుకున్నాయి. నందివనపర్తిలో పనులు ప్రారంభించేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.


ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

తాడిపర్తి, చౌదర్‌పల్లి, తమ్మలోనిగూడ, ధర్మన్నగూడ, కేసీతండా, తక్కళ్లపల్లి తండా, అయ్యవారిగూడెం గ్రామాల్లోనూ నూతన పంచాయతీ భవనాల నిర్మాణాల కోసం ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించారు. తాడిపర్తి, చౌదర్‌పల్లి, తమ్మలోనిగూడ గ్రామాల్లో ఏళ్ల కింద నిర్మించిన భవనాలుండగా కేసీతండా, ధర్మన్నగూడెం, అయ్యవారిగూడెం, తక్కళ్లపల్లి తండాలు కొత్తగా గ్రామ పంచాయతీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ప్రస్తుతం ఈ నాలుగు గ్రామాల్లో ప్రభుత్వ భవనాల్లోనే పాలన కొనసాగుతుండగా, శాశ్వత భవన నిర్మాణాల కోసం నిధుల మంజూరుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరైతే కొత్త పంచాయతీలకు సైతం శాశ్వత భవనాలు ఉంటాయని మండల పంచాయతీ అధికారి శ్రీలత తెలిపారు.

"త్వరలో ప్రారంభిస్తాం



నందివనపర్తిలో ఏళ్ల కింద నిర్మించిన ఇరుకైన గదిలోనే పాలన కొనసాగిస్తున్నాం. సమావేశాల సమయంలో ఇబ్బంది అవుతుంది. పంచాయతీ, రెవెన్యూ, వైద్య, ఇతర సిబ్బంది వచ్చినప్పుడు కష్టంగా విధులు నిర్వర్తిస్తున్నాం. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.
– ఈర్లపల్లి శ్రీనువాస్, పంచాయతీ కార్యదర్శి, నందివనపర్తి


మంతన్‌గౌరెల్లిలో కొనసాగుతున్న పంచాయతీ భవన నిర్మాణ పనులు

పట్టపగలే ఇసుక దోపిడీ!


పాలెపల్లి-ఉదాన్‌రావుపల్లి వాగు నుంచి తవ్వకాలు

దోమ: మండల పరిధిలో ఇసుక అక్రమదందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా సాగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో ఇసుక అక్రమంగా రవాణా చేసే వ్యాపారులు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. మండల పరిధిలోని పాలెపల్లి, ఉదాన్‌రావుపల్లి గ్రామాల నడుమ ఉన్న వాగునుంచి కొందరు వ్యాపారులు నాయకుల పేరు చెప్పి అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. అధికారులు సైతం అటు కన్నెత్తి చూడకపోవడంతో విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ


విత్తనాల మినీకిట్స్ అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

ధారూరు: ధారూరు రైతు వేదికలో శనివారం కంది విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఎల్ఆర్‌జీ–52 రకం కంది విత్తనాలను జాతీయ ఆహార భద్రత కింద వ్యవసాయశాఖ పంపిణీ చేసింది. ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ఏఓ సూర్యప్రకాశ్‌లు రైతులకు కంది విత్తనాల మినీకిట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సంతోష్, సంజూరాథోడ్, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కులంపేరిట దూషించిన వారిపై చర్యలకు డిమాండ్

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన బాధితుడు


ఫిర్యాదు కాపీని చూపుతున్న నర్సింలు

నందిగామ: తనను కులం పేరుతో దూషించిన వ్యక్తులపై నందిగామ ఠాణాలో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని మోత్కులగూడ గ్రామానికి చెందిన వానరాసి నర్సింలు శనివారం ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు ఫిర్యాదు కాపీలను స్థానిక విలేకరులకు అందజేశాడు. ఈ నెల 4న గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్లాటు విషయమై అధికారులతో మాట్లాడుతున్న సమయంలో గ్రామానికి చెందిన జెట్ట శంకరయ్య, జెట్ట రవి, జెట్ట హరీశ్ తనను గ్రామస్తుల సమక్షంలోనే కులం పేరుతో దూషించి, అవమానపరిచి, బెదిరించారని, ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు వారిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కొన్ని రోజులుగా తనను, తన కుటుంబ సభ్యులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్న శంకరయ్య, రవి, హరీశ్‌లపై విచారణ జరిపి ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వీఎంహోంలో అంతర్జాతీయ యోగా వేడుకలు


మాట్లాడుతున్న అందెల శ్రీరాములు, చిత్రంలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: శరీరం, మనస్సు, ఆత్మను ఏకం చేసే విధానమే యోగా అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోం మైదానంలో స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా వేడుకలకు ఎంపీతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ హాజరయ్యారు. యోగా గురువులు ఆసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రశాంతంగా జీవించాలంటే యోగా అవసరమన్నారు. యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని, ప్రాచీన ఆధ్యాత్మిక పతంజలి యోగాను నిత్యం అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుజీత, ఇన్‌స్పెక్టర్లు సైదిరెడ్డి, వినోద్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



మాట్లాడుతున్న శ్రీకాంత్

షాద్‌నగర్: ఉపాధ్యాయులు విధి నిర్వాహణలో నిర్లక్ష్యం వహించడం తగదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయులు వారికి నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. వారితో పనులు చేయించడం సరికాదన్నారు. ఇటీవల నేరేళ్లపల్లి పాఠశాలలో విద్యార్థులతో మూత్రశాలలు కడిగించడం, పాటిగడ్డలో ఉపాధ్యాయులు విధులకు సెలవు పెట్టి సొంత పనులకు వెళ్లడం వెళ్ళడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతారన్నారు. అటువంటి ఉపాధ్యాయులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శివశంకర్, ఆదిల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్తలుగా ఎదగాలి


యాలాల: మొగులయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

తాండూరు టౌన్: వీధి వ్యాపారులు స్వయం శక్తితో వ్యాపార వేత్తలుగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్, మెప్మా ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట వీధి వ్యాపారులతో ఫుడ్ మేళా ఏర్పాటు చేశారు. స్టాల్స్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు భవిష్యత్‌లో పెద్ద వ్యాపారులుగా అభివృద్ధి చెందాలన్నారు. పట్టుదల, శ్రమతో సాధించనిది ఏదీ లేదని, పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు అనేక మంది చిరు వ్యాపారులుగానే జీవితాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. వీధి వ్యాపారుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ సమాజానికి అండగా ఉంటా

ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదానికి గురైన పట్టణంలోని వీరశైవ కల్యాణ మండపాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే బీఎమ్మార్ సందర్శించారు. అగ్ని ప్రమాదానికి కారణం, ప్రమాదంలో సంభవించిన నష్టాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. మండపం మరమ్మతులకు ప్రభుత్వం తరపున ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి

తెలంగాణ సిద్ధాంత కర్త.. స్వర్గీయ ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలి, మలిదశ ఉద్యమాల్లో ఆయన కృషిని మరువలేమన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం చివరి వరకు పోరాడిన మహోన్నత వ్యక్తి అని, నేటి యువత ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు సోమశేఖర్, ప్రభాకర్ గౌడ్, నీరజ, నాయకులు పట్లోళ్ల నర్సింలు, హబీబ్ లాలా, సంతోష్, వేణు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

యాలాల: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాస్నం గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అసైన్డ్ రైతుల భూముల్లో బోర్ల డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ అధికారులు మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా రాస్నం గ్రామాన్ని ఎంపిక చేశారని తెలిపారు. గ్రామ పరిధిలో సుమారు 111 ఎకరాల అసైన్డ్ భూమి ఉందని, 12 యూనిట్లుగా రైతులను ఎంపిక చేసి వారి భూముల్లో బోర్లు వేసినట్లు తెలిపారు. దీంతో 69 ఎకరాలకు పైగా నీరందుతుందని, 35 కుటుంబాలు లబ్ధిపొందుతాయని వివరించారు. ఇందు కోసం రూ.9.57 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. బోర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పుష్పలీల, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భీమప్ప, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, మాజీ అధ్యక్షుడు మన్నాన్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, మాజీ సర్పంచులు హన్మంతు, మధుసూదన్‌రెడ్డి, నాయకులు ఆరిఫ్ హుస్సేన్, లక్ష్మీకాంత్ రెడ్డి, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులతో ఫుడ్ మేళా
- పాల్గొన్న ఎమ్మెల్యే బీఎమ్మార్

మొగులయ్య సేవలు మరువలేని

ఉపాధ్యాయ వృత్తిలో మొగులయ్య అందించిన సేవలు మరువలేనివని, ప్రతి ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ తప్పదని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అగ్గనూరు ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం మొగులయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొగులయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు వెంకట్‌రాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, రాములు, మురహరినాథ్, ప్రభాకర్‌చారి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.